క్లుప్తంగా

నేడు లబ్ధిదారుల ఎంపిక

టేకుమట్ల/చిట్యాల: మైనారిటీ వెల్ఫేర్‌లో సబ్సిడీ రుణాల లబ్ధిదారుల ఎంపిక నేడు(మంగళవారం) టేకుమట్ల, చిట్యాల మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ అనిత, రామయ్య సోమవారం వేర్వేరు ప్రకటనలో పేర్కొన్నారు. దరఖాస్తు చేసుకున్న వారు ఉదయం 11:30 గంటలకు ఆన్‌లైన్ అప్లికేషన్ ఫాం, ఆధార్‌కార్డు, రేషన్‌కార్డు, కులం, ఆదాయం, పుట్టిన తేదీ, తదితర పత్రాలను వెంట తీసుకురావాలని తెలిపారు.

రేపు విద్యా సదస్సు

చిట్యాల: జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఈ నెల 12న విద్యా పరిరక్షణ కమిటీ ఆధ్వర్యంలో విద్యా సదస్సును నిర్వహించనున్నట్లు డీటీఎఫ్ మండల శాఖ అధ్యక్ష, కార్యదర్శులు ఇ.జంపయ్య, చేరి ప్రభాకర్‌లు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యారంగము రోజు రోజుకు వ్యాపారికరణ చెందిందని, ఇలాంటి పరిస్థితిలలో పేద మధ్యతరగతి ప్రజలకు విద్య అందని ద్రాక్షగా మిగిలి పోతుందన్నారు. విద్యా విధానం ఒక శాస్త్రీయ పద్ధతిలో ఉండాలనే ఆలోచనతో ఈ సదస్సు నిర్వహించడం జరుగుతుందన్నారు. ఉపాధ్యాయులు, విద్యార్థులు, యువత, ప్రజలు సదస్సులో పాల్గొనాలని వారు కోరారు.

నియామకం



మల్హర్: నేషనల్ హ్యూమన్ రైట్స్ కౌన్సిల్(ఎన్‌హెచ్‌ఆర్‌సీ) మండల అధ్యక్షుడిగా మండల కేంద్రం తాడిచర్ల గ్రామానికి చెందిన చింతల కుమార్‌యాదవ్, ప్రధాన కార్యదర్శిగా రవీందర్, ఉపాధ్యక్షుడిగా సుధాకర్ సోమవారం నియమితులయ్యారు. ఎన్‌హెచ్‌ఆర్సీ ఉమ్మడి వరంగల్ జిల్లా అధ్యక్షుడు బుర్ర రమేష్, రాష్ట్ర సహాయ కార్యదర్శి శ్రీకాంత్, భూపాలపల్లి జిల్లా అధ్యక్షుడు సబావత్ నాగరాజు, ప్రధాన కార్యదర్శి వంగ కుమారస్వామిలు నియామకపత్రాన్ని జారీ చేశారు. ఈ మేరకు వారికి నియామకం పత్రాలు అందజేశారు.

కమిటీ ఎన్నిక

మహాముత్తారం: మండలకేంద్రంలో సోమవారం గ్రామ పంచాయతీ కార్మికుల మండల కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండల అధ్యక్షుడిగా ఎండీ పషోద్దీన్, ఉపాధ్యక్షుడిగా కాంతాల శ్రీనివాస్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శిగా మారపాక రాజశేకర్, సహాయ కార్యదర్శిగా పుల్యాల సాగర్, కోషాధికారిగా పుల్యాల రాజు, సలహదారుడిగా మండల రాజుతో పాటు మరికొంత మందిని కార్యవర్గ సభ్యులుగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. నూతన అధ్యక్షుడు పషోద్దిన్ మాట్లాడుతూ.. కార్మికుల హక్కుల కోసం కృషిచేస్తానని అన్నారు. తనకు అధ్యక్షుడిగా అవకాశం ఇచ్చిన తోటి కార్మికులు ధన్యావాదాలు తెలిపారు.

జాతీయ చేనేత ఐక్యవేదిక కార్యదర్శిగా నరేందర్



చిట్యాల: జాతీయ చేనేత ఐక్యవేదిక రాష్ట్ర కమిటీ కార్యదర్శిగా మండల కేంద్రానికి చెందిన కట్కూరి నరేందర్‌ను నియమించినట్లు రాష్ట్ర అధ్యక్షుడు రాపోలు వీరమోహన్ సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. తనను నియమించినందుకు రాష్ట్ర అధ్యక్షుడు వీరమోహన్, ఉపాధ్యక్షుడు భీమనాథుని సత్యనారాయణలకు నరేందర్ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

ఫీల్డ్ అసిస్టెంట్‌కు అస్వస్థత



కాటారం: ఉపాధిహామీ పథకంలో కాటారం ఫీల్డ్ అసిస్టెంట్‌గా విధులు నిర్వర్తిస్తున్న గజ్జల రాజమణి అస్వస్థతకు గురయ్యారు. సోమవారం కార్యాలయానికి వెళ్లిన రాజమణి కుప్పకూలిపోవడంతో భూపాలపల్లిలోని ఆస్పత్రికి తరలించినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. ఏప్రిల్ నెలలో అధిక సంఖ్యలో కూలీలు పనికి వచ్చేలా చూడాలని స్థానిక అధికారులు ఒత్తిడి తెవడంతోనే అస్వస్థతకు గురయిందని వారు ఆరోపించారు. ఫీల్డ్ అసిస్టెంట్లు టార్గెట్లు రీచ్ అవాలని ఒత్తడి చేయడంతో తీవ్ర మనోవేదనకు గురవుతు విధులు నిర్వర్తిస్తున్నట్లు తెలిపారు. ఈ విషయమై ఎంపీడీఓ శంకర్‌ను 'సాక్షి' వివరణ కోరగా కాటారంలో ఫీల్డ్ అసిస్టెంట్ ఉపాధి పని కల్పనకు సంబంధించి డిమాండ్ దరఖాస్తు తీసుకోకపోవడంతో ఈ రోజు పనులు నిలిచిపోయాయన్నారు. దీనికి సంబంధించి వివరాలు అడిగామే తప్ప ఎలాంటి పని ఒత్తడి లేదన్నారు. టార్గెట్లు పెట్టి ఒత్తడి చేస్తున్నామనేది అవాస్తమని కావాలని ఆరోపణలు చేస్తున్నారు అని తెలిపారు.

కరపత్రాల ఆవిష్కరణ

మంగపేట: జిల్లా కేంద్రంలో ఈనెల 30న నిర్వహించనున్న సామాజిక న్యాయ వేదిక తొలి ఆవిర్భావ సదస్సుకు అన్ని కులసంఘాల ప్రతినిధులు హాజరై విజయవంతం చేయాలని తుడుందెబ్బ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ మైపతి అరుణ్‌కుమార్ పిలుపునిచ్చారు. మండలంలోని కమలపురం అంబేద్కర్ విగ్రహం వద్ద సామాజిక న్యాయవేదిక కరపత్రాన్ని అరుణకుమార్ సోమవారం ఆవిష్కరించారు. నాగేశ్వర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

పట్టా పాస్ పుస్తకాలు ఇవ్వాలి



గుడాడ్‌పల్లిలో మాట్లాడుతున్న నాయకులు

భూపాలపల్లి రూరల్: తెలంగాణ ప్రభుత్వం సాదాబైనామాను అమల్లోకితీసుకువచ్చి దరఖాస్తు చేసుకున్నా రైతులకు పట్టా పాస్‌పుస్తకాలు ఇవ్వాలని ఓబీసీ జిల్లా అధ్యక్షుడు దొంగల రాజేందర్ డిమాండ్ చేశారు. పల్లె పల్లెకు ఓబీసీ–ఇంటింటికీ బీజేపీ కార్యక్రమంలో భాగంగా సోమవారం కొత్తపెల్లి (ఎస్ఎం), మోరంచపల్లి, కొంపల్లి, గుడాడుపల్లి, శ్యామ్‌నగర్ గ్రామాల్లో ఓబీసీ నాయకులు ఇంటింటికీ వెళ్లి బీజేపీ అమలు చేస్తున్న సంక్షేమ పథకాలకు సంబంధించిన కరపత్రాలను పంపిణీ చేశారు. ఆయా గ్రామాల్లో ఏర్పాటు చేసిన కార్యక్రమాల్లో రాజేందర్ మాట్లాడుతూ.. ఏ గ్రామం వెళ్లిన రైతులు పట్టా పాసుపుస్తకాలు రాలేదని, సాదాబైనామాలో దరఖాస్తులు చేసుకొని మూడు సంవత్సరాలు పూర్తయినప్పటికీ ప్రభుత్వం ఇప్పటివరకు పట్టా పాస్ పుస్తకాలు ఇవ్వలేదని దీంతో రైతుబంధు కోల్పోతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారన్నారు. ధరణి వల్ల ఎప్పుడో అమ్ముకున్న భూస్వాములు మా భూములంటూ డబ్బులు డిమాండ్ చేస్తున్నారని రైతులు వాపోతున్నారని తెలిపారు. పార్టీ ఆధ్వర్యంలో రానున్న రోజుల్లో రైతుల పక్షాన ధరణి పోర్టల్ సమస్యలపై పోరాటం చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు బట్టు రవి, గీస సంపత్, నాంపల్లి కుమార్, సమ్మయ్య, నిమ్మల కుమార్, జంజర్ల సురేష్, నడిగట్టు శ్రీనివాస్, మహేష్, రెంటాల రాజిరెడ్డి, కోటేశ్వర్, ఓదెలు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు దుప్పట్ల పంపిణీ



దుప్పట్లు పంపిణీ చేస్తున్న ప్రధానోపాధ్యాయుడు, రాజారావు

కాటారం: తాను పని చేస్తున్న పాఠశాలలో విద్యార్థులకు దుప్పట్లు పంపిణీ చేసి సేవా దృక్పథాన్ని చాటుకున్నాడు ఓ ఉపాధ్యాయుడు. కాటారం మండలం జాదారావుపేట ప్రభుత్వ పాఠశాలలో హిందీ ఉపాధ్యాయుడిగా పని చేస్తున్న ఎస్‌వీఎస్ రాజారావు విద్యార్థులకు సోమవారం దుప్పట్లు పంపిణీ చేశారు. రూ.పది వేలు చేసే దుప్పట్లను పాఠశాల ప్రధానోపాధ్యాయుడు సురేశ్ చేతుల మీదుగా అందజేశారు. రాజారావు పూర్వ విద్యార్థుల ద్వారా విరాళాలు సేకరించి పాఠశాల అభివృద్ధి కోసం తన వంతు కృషి చేస్తున్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యార్థుల చేయూత..

మండలంలోని జాదారావుపేట ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు అనాథ వృద్ధులకు చేయూతనందించారు. విద్యార్థులు విరాళాలు సేకరించిన రూ.3854లను శ్రీసాయి అనాథ వృద్ధాశ్రమ వేల్ఫేర్ సొసైటీకి సోమవారం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎచ్ఎం సురేశ్, ఉపాధ్యాయులు ప్రతాప్, రాజారావు, రాంప్రసాద్, సుమన్, సౌజన్య, విద్యార్థులు పాల్గొన్నారు.

సన్మానం



సన్మానం పొందిన రవీందర్

చిట్యాల: శ్రీ శ్రీ కళావేదిక వారి ఆధ్వర్యంలో తిరుపతిలోని మహతి ఆడిటోరియంలో ఈ నెల 9, 10 వ తేదీల్లో 48 గంటల పాటు నిర్విరామంగా నిర్వహించిన ప్రపంచ తెలుగు సాహితీ బ్రహ్మోత్సవాలలో సాహితీ రంగం నుంచి చిట్యాల మండలంలోని జడలపేటకు చెందిన కవి, రచయిత ఆర్టిస్ట్ పుట్టకొక్కుల రవీందర్ పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో రైతులపై తన గాత్రాన్ని వినిపించిన రవీందర్‌ను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో నిర్వాహకులు డాక్టర్ కత్తిమండ ప్రతాప్, శ్రీ శ్రీ కళావేదిక చైర్మన్ ప్రపంచ సాహిత్య సాంస్కృతిక అకాడమీ, పిల్లంగోల శ్రీలక్ష్మి ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర సాహిత్య అకాడమీ రమావతి పాల్గొన్నారు.

'కంటి వెలుగు' శిబిరం ప్రారంభం



కంటివెలుగు శిబిరాన్ని ప్రారంభిస్తున్న సర్పంచ్ దూలం మల్లయ్యగౌడ్

మహాముత్తారం: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన కంటివెలుగు కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సర్పంచ్ దూలం మల్లయ్య అన్నారు. సోమవారం మండలంలోని ములుగుపల్లి గ్రామంలో నిర్వహించిన కంటివెలుగు శిబిరాన్ని ప్రారంభించి మాట్లాడారు. 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరూ కంటిపరీక్షలు నిర్వహించుకోవాలని సూచించారు. వైద్యాధికారి బండి శ్రీనివాస్, అంగన్‌వాడీ కార్యకర్త ప్రమీల, పంచాయతీ కార్యదర్శి లక్ష్మి పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలి

భూపాలపల్లి రూరల్: విద్యుత్ సంస్థలోని ఆర్టిజన్ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని తెలంగాణ విద్యుత్ ఎంప్లాయీస్ యూనియన్ జెన్‌కో రాష్ట్ర జనరల్ సెక్రటరీ ఆవుల కృష్ణారెడ్డి డిమాండ్ చేశారు. సోమవారం చెల్పూరు జెన్‌కో గేట్ ఎదుట ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఆర్టిజన్ ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసం దశలవారి కార్యక్రమంలో భాగంగా ఈ నెల 13న భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పాల్వంచ జెన్‌కో ఎదుట ధర్నా నిర్వహించనున్నట్లు తెలిపారు. ప్రభుత్వం, విద్యుత్ సంస్థ స్పందించకుంటే ఈనెల 25న రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు విధును బహిష్కరించి సమ్మెకు దిగడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమములో యూనియన్ నాయకులు తిరుపతిరెడ్డి, మల్లయ్య, రవీందర్, నవీన్, కోటేశ్వరరావు, కార్మికులు పాల్గొన్నారు.

స్పోర్ట్స్ షూస్ అందజేత

ఏటూరునాగారం: మండల కేంద్రానికి చెందిన ఫుట్ బాల్ క్రీడాకారులకు షూస్‌లను సోమవారం అందజేశారు. వావిలాల చిన్న ఎల్లయ్య, చిటమట లావణ్య, చిటమట వసంత సహకారంతో అందజేసినట్లు కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు చిటమట రఘు తెలిపారు.

ఉన్నత స్థాయిలో రాణించాలి



మాట్లాడుతున్న ఎస్సై జాడి శ్రీధర్

మొగుళ్లపల్లి: విద్యార్థులు భవిష్యత్‌లో ఉన్నత చదువులు చదివి అత్యున్నత స్థానం సంపాదించి తల్లిదండ్రులకు, గురువులకు మంచి పేరు తేవాలని ఎస్సై జాడి శ్రీధర్ అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని కేశవ పాఠశాల విద్యార్థులు పోలీస్‌వ్యవస్థ అవగాహన కోసం నూతన పోలీస్‌స్టేషన్‌ను సందర్శించారు. విద్యార్థులకు 100 డయల్ విధానాన్ని ప్రాక్టికల్‌గా చూపించారు. ఆస్తులతో గౌరవం రాదని, ఉన్నత స్థాయిలో రాణించినట్లయితే సమాజంలో గౌరవం పెరుగుతుందని ఎస్సై అన్నారు. కార్యక్రమంలో ఏఎస్సై రత్నం, ప్రిన్సిపాల్ గుండారపు రమేష్, కరస్పాండెంట్ సిందే భుజంగారావు, డైరెక్టర్ చిలుకమారి రజిత, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

ఆటో బోల్తా.. విద్యార్థులకు గాయాలు



చికిత్స పొందుతున్న విద్యార్థులు

మల్హర్: రోడ్డుపై ఉన్న గుంతను తప్పించబోయి ఆటో బోల్తా పడి పదో తరగతి విద్యార్థులకు గాయాలైన సంఘటన మండలంలోని తాడిచర్ల ఎర్రగుంట చెరువు సమీపంలో సోమవారం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మల్లారం జిల్లా పరిషత్ పాఠశాలలో పదోతరగతి చదువుతున్న విద్యార్థులు తాడిచర్లలో నిర్వహిస్తున్న పరీక్ష కేంద్రంలో పరీక్షలు రాశారు. తిరిగి ఆటోలో ఇంటికి వెళ్తున్న క్రమంలో తాడిచర్ల ఎర్ర గుంట చెరువు సమీపంలోని మూలమలుపు వద్ద రోడ్డుపై ఉన్న గుంతను డ్రైవర్ తప్పించే క్రమంలో ఆటో బోల్తాపడింది. ఈ ప్రమాదంలో మల్లారం, చిన్న తూండ్ల గ్రామాలకు చెందిన విద్యార్థులు స్వరూప, హరీష్, ప్రణీత్, హరిత, మరొకరికి గాయాలయ్యాయి. వారిని తాడిచర్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించి చికిత్స చేయించారు. తీవ్ర గాయాలయిన స్వరూప, హరీష్‌లను 108 వాహనం ద్వారా భూపాలపల్లిలోని ప్రభుత్వ ఆస్పత్రి తరలించారు. ఆటోలో 9 విద్యార్థులు ప్రయాణించగా ఐదు గురికి గాయాలయ్యాయి.

1001 రకం ధాన్యంతో నష్టపోతున్నాం..



మహేందర్‌కు వినతిపత్రం అందిస్తున్న మిల్లర్లు

టేకుమట్ల(రేగొండ): 1001 రకం ధాన్యంతో నష్టపోతున్నామని జిల్లా రైస్ మిల్లర్ అసోసియేషన్ సభ్యులు ఆవేదన వ్యక్తం చేశారు. రేగొండ మండల కేంద్రంలో వారు మాట్లాడుతూ.. రైతులు 1001 రకానికి చెందిన పంటను ఎక్కువగా వేస్తున్నారని తెలిపారు. ఈ రకం వడ్లతో మిల్లింగ్ చేసి, సీఎంఆర్ ఇవ్వలేక పోతున్నామని మిల్లర్లు నష్టాలను చవి చూస్తున్నారని వాపోయారు. కావున యాసంగిలో ధాన్యం కొనుగోలు కేంద్రాలు, పీఏసీఎస్, ఐకేపీ సెంటర్‌లలో 1001 రకం మినహాయించి ఎంటీయూ, 1061, 1064, 1224, 1262 లను కొనుగోలు చేసి మిల్లర్లకు పంపించాలని అన్నారు. అనంతరం రైతు బంధు సమితి జిల్లా కో ఆర్డినేటర్ హింగె మహేందర్‌జీ, రేగొండ మండల వ్యవసాయాధికారి వాసుదేవరెడ్డికి వినతిపత్రాన్ని అందించారు.

బాధిత కుటుంబాలకు పరామర్శ



పరామర్శిస్తున్న ఎమ్మెల్సీ మధుసూదనాచారి



ఆర్థిక సాయం అందిస్తున్న నాయకులు

టేకుమట్ల(రేగొండ): రేగొండ మండలంలోని తిరుమలగిరి గ్రామానికి చెందిన బీఆర్ఎస్ నాయకుడు కట్ల మధుసూదన్‌రెడ్డి తండ్రి సమ్మిరెడ్డి ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. దీంతో బాధిత కుటుంబ సభ్యులను ఎమ్మెల్సీ సిరికొండ మధుసూదనాచారి సోమవారం పరామర్శించారు. ఆయన వెంట నాయకులు రాజిరెడ్డి, సదానందం, వావిలా రమేష్, గోపు భిక్షపతి, నర్సింగరావు, వినోద్, బూర్గుల ప్రభాకర్, రాజు, శివ, తదితరులు ఉన్నారు.

ఆర్థిక సాయం

రేగొండ మండలంలోని నిజాంపల్లి నిరుపేద కుటుంబానికి చెందిన వంగల చంద్రమౌళి ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. దీంతో బాధిత కుటుంబానికిపెరిక సంఘం నాయకులు రూ.30వేల ఆర్థిక సాయం అందించి అండగా నిలిచారు. ఈ కార్యక్రమంలో పెరిక కుల సంఘం నాయకులు, సభ్యులు ఉన్నారు.

బలగం చిత్రాన్ని తిలకిస్తున్న గ్రామస్తులు



టేకుమట్లలో 'బలగం'

టేకుమట్ల: మానవ సంబంధాలను ఆవిష్కరించి, పల్లెపల్లెన నేడు అందరి ఆదరాభిమానాలను పొందుతూ ప్రతీ ఒక్కరికి ఆలోజింపజేస్తున్న చిత్రం 'బలగం'. సోమవారం మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయ ఆవరణలో బలగం చిత్ర ప్రదర్శన చేపట్టారు. పిల్లల నుంచి వృద్ధుల వరకు చిత్రాన్ని తిలకించారు. చిత్ర ప్రదర్శనకు సహకరించిన సర్పంచ్ పాలాల సరోత్తంరెడ్డి, ఎంపీటీసీ ఆది సునీతరఘులకు గ్రామస్తులు కృతజ్ఞతలు తెలిపారు.

సమన్వయంతో పనిచేయాలి



మాట్లాడుతున్న రాజేందర్‌గౌడ్

ములుగు: కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పనిచేసి రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లో ఎమ్మెల్యే సీతక్కను అధిక మెజారిటీతో గెలిపించాలని ములుగు మండల ఇన్‌చార్జ్, కిసాన్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు గొల్లపెల్లి రాజేందర్ గౌడ్ అన్నారు. సోమవారం జిల్లా కేంద్రములో కాంగ్రెస్ పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రాజేందర్ మాట్లాడుతూ.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల వైఫల్యాలను ప్రతి ఇంటికి తీసుకుపోవాలన్నారు. అనంతరం నూతన మండల కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా ఎండీ చాంద్ పాషా, వర్కింగ్ కమిటీ అధ్యక్షులుగా ఆకుతోట చంద్రమౌళి, నల్లెల భరత్ కుమార్ ఎన్నికయ్యారు. అలాగే ఉపాధ్యక్షులుగా ఎర్రబెల్లి దేవేందర్ రావు, కాగితపు దేవేంద్ర చారి, ఆర్శం రఘు, ప్రధాన కార్యదర్శులుగా దూడ బోయిన వేణు యాదవ్, భూక్యా బాలాజీ, గుండబోయిన మహేందర్‌గౌడ్, కోశాధికారిగా ప్రకాష్, కార్యదర్శులుగా జెట్టి విజయ, గొల్లవెన మొగిలి, బొమ్మరవేని శివకృష్ణ, కోలిపాక సాంబయ్య ఎన్నికయ్యారు. ఈ కార్యక్రమంలో యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు బానోత్ రవి చందర్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు బైరెడ్డి బాగవాన్, ఫిషర్ మెన్ జిల్లా అధ్యక్షుడు కంబాల రవి, బొక్క సత్తిరెడ్డి, రాజు, జిల్లా అధికార ప్రతినిధి ముషినపెల్లి కుమార్‌గౌడ్, మండల మాజీ అధ్యక్షుడు రవీందర్ రెడ్డి, జయపాల్ రెడ్డి, అశోక్‌గౌడ్, రసుపుత్ సీతారాం నాయక్, జంపాల ప్రభాకర్ పాల్గొన్నారు.

రక్తదానం మరొకరికి ప్రాణదానం

ఏటూరునాగారం: రక్తదానం చేయడం మరొకరికి ప్రాణదానం చేయడమే అవుతుందని రెడ్ క్రాస్ సొసైటీ లైఫ్ మెంబర్, కెమిస్ట్రీ అండ్ డ్రగ్గిస్ట్ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి అజ్మత్‌ఖాన్ అన్నారు. సోమవారం మండల కేంద్రంలో ఏటూరునాగారం బ్లడ్ బ్యాంక్ వద్ద రక్తదానం చేసిన దాతలకు అజ్మత్ ఖాన్ సన్మానించారు. సహాయ నిధికి రూ.1000ల విరాళంగా అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. బ్లడ్ డోనర్స్ వల్ల వందలాది మందికి రక్తం ఉచితంగా లభిస్తోందన్నారు. ఎందరినో ఆపదలో ఆదుకుంటుందని, బ్లడ్ డోనర్స్ నిర్వాహకులను ఆయన అభినందించారు. ఈ కార్యక్రమంలో వహిద్, రాజేష్, మురళితో పాటు తదితరులు పాల్గొన్నారు.

'డబుల్' ఇళ్లు కేటాయించాలి

ములుగు రూరల్: డబుల్ బెడ్‌రూం ఇళ్లను నిరుపేదలకు కేటాయించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి తుమ్మల వెంకట్‌రెడ్డి అన్నారు. ఈ మేరకు అదనపు కలెక్టర్ ఇలా త్రిపాఠికి సోమవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వెంకట్‌రెడ్డి మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం నియోజకవర్గానికి 2 వేల ఇళ్ల నిర్మాణానికి నిధులు కేటాయించిందని అన్నారు. గృహలక్ష్మీ పథకంలో భాగంగా ఇళ్ల నిర్మాణానికి రూ.3 లక్షలు అందిస్తామని తెలిపిందని అన్నారు. ఈ పథకంలో రాజకీయ జోక్యం లేకుండా గ్రామ సభల ద్వారా అర్హులైన పేదలను ఎంపిక చేయాలని అన్నారు.

అంబేడ్కర్‌ను అవమానించడం సరికాదు



పస్రాలో మాట్లాడుతున్న ఇరుగు పైడి



మంగపేట: తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

ములుగు రూరల్(గోవిందరావుపేట): భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్‌ను అవమానిచడం సరికాదని మహాజన సోషలిస్టు పార్టీ జిల్లా ఇన్‌చార్జ్ ఇరుగు పైడి మాదిగ అన్నారు. సోమవారం పస్రాలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. మంగపేట మండలంలో అంబేడ్కర్ విగ్రహాలను ఏర్పాటు చేయకూడదని ప్రభుత్వ ఉపాధ్యాయుడు వీరయ్య అనడం అంబేడ్కర్‌ను అవమానించినట్లే అని అన్నారు. తక్షణమే అతడిపై చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మడిపెల్లి శ్యాంబాబు, దుర్గారావు, సారయ్య, భద్రయ్య పాల్గొన్నారు.

చర్య తీసుకోవాలని వినతి

మంగపేట: భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్‌ను దూషించిన వీరయ్యపై చర్య తీసుకోవాలని కోరుతూ అంబేడ్కర్ యువజనసంఘం మండల కమిటీ ఆధ్వర్యంతో తహసీల్దార్ శ్రీనివాసులుకు సోమవారం వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆ సంఘం మండల అధ్యక్షుడు బసారికాని హరికృష్ణ మాట్లాడుతూ.. అంబేద్కర్ రచించిన రాజ్యాంగంలోని రిజర్వేషన్‌తో టీచర్ ఉద్యోగం పొంది రాజ్యాంగాన్ని, ఈ ప్రాంతంలో ఉన్న అనగారిన కులాలను దూషిస్తున్న వీరయ్యను వెంటనే అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. చట్ట ప్రకారంగా ఆయనపై చర్యలు తీసుకోని ఎడల ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో అంబేడ్కర్ సంఘం సీనియర్ నాయకులు పగిడిపల్లి వెంకటేశ్వర్లు, ఎంపెల్లి సమ్మయ్య, పరికి శ్రీనివాస్, మేడిద సతీష్, కోడెల నరేష్, నిమ్మగడ్డ ప్రవీణ్, బొర్రయ్య తదితరులు పాల్గొన్నారు.

న్యూట్రిషన్ కిట్ల పంపిణీ



కిట్లను అందజేస్తున్న వైద్య సిబ్బంది

మహదేవపూర్: మండలంలోని అంబట్‌పల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో గ్రామంలో గర్భిణులకు న్యూట్రిషన్ కిట్‌లను పంపిణీ చేసినట్లు వైద్య సిబ్బంది తెలిపారు. పోషకాహారం అందించడంలో రాష్ట్ర ప్రభుత్వం అందజేసిన కిట్లను పంపిణీ చేసినట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్ మాసూక్ అలీ, ఏఎన్ఎం, ఆశ వర్కర్లు, పాల్గొన్నారు.